డ్రెయిన్ల ఆక్రమణతో ట్రాఫిక్ సమస్యలు

- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పాన్ షాపుల ఏర్పాటు
- జాతీయ రహదారిలో రాకపోకలకు ఇక్కట్లు
- వాహనచోదకుల ఆవేదన


కొయ్యలగూడెం మెయిన్ సెంటర్లో ట్రాఫిక్ సమస్య


కొవ్వూరు రోడ్డులో డ్రెయిన్‌పై ఏర్పాటుచేసిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్

కొయ్యలగూడెం: దేవరపల్లి – తల్లాడ జాతీయ ప్రధాన రహదారి 516 (డి)పై కొయ్యలగూడెంలో డ్రెయిన్లు ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. డ్రెయిన్లపై ఏర్పాటుచేసిన కాంక్రీట్ దిమ్మెలపై నుంచి పాదచారులు రాకపోకలు సాగించేవారు. పాదచారులు జాతీయ రహదారిపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నడిచే క్రమంలో వెనుక నుంచి వేగంగా దూసుకొస్తున్న వాహనాలతో పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

చిరు వ్యాపారులకు అడ్డా!

కొయ్యలగూడెంలోని కొవ్వూరు రోడ్డు బస్టాండ్ నుంచి మెయిన్ సెంటర్ వరకు, జంగారెడ్డిగూడెం రోడ్డులో డ్రెయిన్లు ఇరువైపులా డ్రెయిన్లు ఆక్రమణకు గురయ్యాయి. ప్రధానంగా కొవ్వూరు రోడ్డులో డ్రెయినేజీలను ఆక్రమించి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పాన్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా రక్షణ కోసం నిర్మించిన ఐరన్ గ్రిల్స్‌ను సైతం దుకాణదారులు తొలగించి వ్యాపారాలకు అనువుగా మార్చేసుకున్నారు. డ్రెయిన్లపై కొన్నిచోట్ల దుకాణదారులు ఏకంగా కాంక్రీట్ పనులు సైతం నిర్వహించి వ్యాపారాలకు అడ్డాగా మార్చేశారు. కొనుగోలుదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సమస్యపై పంచాయతీ వారికి వాహనదారులు ఫిర్యాదు చేస్తుంటే నేషనల్ హైవే అధికారులు పరిష్కరించాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో జాతీయ ప్రధాన రహదారి అధికారులకు ఏడాది కాలంగా పలుమార్లు సమస్యపై ఫిర్యాదులు వెళ్లినప్పటికీ పరిష్కారం లేకుండా పోయిందని పలువురు ఆరోపించారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి, రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్పందన కరువు



డ్రెయిన్లపై ఏర్పాటుచేసిన కాంక్రీట్ దిమ్మెలు కొన్నిచోట్ల నాణ్యతా లోపాలతో కూలిపోయాయి. మరి కొన్నిచోట్ల కాంక్రీట్ దిమ్మెలపై స్టాల్స్ ఏర్పాటు చేయడంతో కుంగిపోయాయి. సమస్యపై నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదులు వెళ్లినా స్పందన లేకుండా పోయింది.

– ఏఆర్కే హనుమంతరావు, రాష్ట్ర కన్స్యూమర్ ఫోరం ఉపాధ్యక్షుడు, కొయ్యలగూడెం

తరచూ ప్రమాదాలు



కొయ్యలగూడెంలోని జాతీయ ప్రధాన రహదారి డ్రెయిన్ ఆక్రమణ సంస్కృతి బయ్యన్నగూడెంకు కూడా విస్తరించింది. అదే ఇబ్బందులు, అక్కడి సమస్యలే ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు వస్తూ వెళుతూ స్టాల్స్‌కి ఎదుట ఉన్న వాహనాలను తప్పించబోయి డివైడర్లను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి.

– ఆరేటి ఏసుబాబు, తపన ఫౌండేషన్ కన్వీనర్, బయ్యన్నగూడెం

క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక


పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో ప్రతాపనేని వాసు

ద్వారకాతిరుమల: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు గత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

పార్టీ పటిష్టతకు కృషి


మేడూరి రంగబాబు

కామవరపుకోట: పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కామవరపుకోటకు చెందిన సీనియర్ నాయకులు, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, స్థానిక నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు.

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు


మద్యం షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి : మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదుచేసి, వారి నుంచి ఏడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. రాఘవాపురం గ్రామంలోని మద్యం షాపులో రికార్డులను పరిశీలించామని చెప్పారు. మద్యం ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహరావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్దుమణిగిన దారి సమస్య


బర్రెవారిగూడెంలో తాత్కాలికంగా పరిష్కారమైన దారి సమస్య

టి.నరసాపురం: అధికారుల చొరవతో దారి సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. మండలంలోని జగ్గవరం పంచాయతీ బర్రెవారి గూడెంలో సుమారు 30 కుటుంబాల వారు 40 సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్న రహదారికి అడ్డంగా నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన సుమారు నాలుగు కుటుంబాల వారు ఈ స్థలం తమదని తాటిచెట్టు, ముళ్లకంప వేసి అడ్డుకున్నారు. గ్రామస్తులు సమస్యను తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. దారి సమస్యకు సంబంధించి త్వరలో సర్వే నిర్వహిస్తామని, అప్పటి వరకు రహదారికి అడ్డంగా వేసి వాటిని తొలగించాలని ఎస్సై జయబాబు చెప్పడంతో గొడవ తాత్కాలికంగా సర్దుమణిగింది.

విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ


విశ్వేశ్వరరావు విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొల్లూరి విశ్వేశ్వరరావు (విశ్వేశ్వరయ్య) వల్లే కొయ్యలగూడెం అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. గురువారం గవర్నమెంట్ ఆసుపత్రికి ఎదురుగా పరింపూడి పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొయ్యలగూడెంలో 20కి పైగా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాన్ని, పేదలకు ఇళ్లస్థలాలను ఉచితంగా విశ్వేశ్వరరావు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కొల్లూరి విశ్వేశ్వరరావు ఇచ్చిన దానాల విలువ నేటి లెక్కల ప్రకారం రూ.500 కోట్లు పైగానే ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎనిమిదో రోజుకు దీక్షలు

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామక చట్టం చేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు కొనసాగాయి. ఏటీఏ జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం గంగరాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు రవ్వా బసవరాజు, పలువురు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మరుగుదొడ్లు


బస్టాండ్‌లో వినియోగానికి సిద్ధమైన మరుగుదొడ్లు

జంగారెడ్డిగూడెం: స్థానిక బస్టాండ్‌లో మరుగుదొడ్లను పునఃప్రారంభించినట్టు ఆర్టీసీ డీఎం గంగాధర్ తెలిపారు. వీటికి గత కొంతకాలంగా చేస్తున్న మరమ్మతు పనులు పూర్తయినట్టు చెప్పారు. మంచి నీటి కుళాయిలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బస్టాండ్‌లో కుర్చీలు, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రయాణికులు వినియోగించుకోవాలని డీఎం కోరారు.

గంధం బోసు కుటుంబానికి భరోసా


మాజీ సీఎం జగన్‌తో గంధం బోసు పిల్లలు, పార్టీ నాయకులు

బుట్టాయగూడెం: ఇటీవల హత్యకు గురైన గంధం బోసు కుటుంబానికి అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోసు కూతురు ఆరాధ్య, కుమారుడు అనురూప్‌శక్తిలు, కుటుంబ సభ్యులు వైఎస్ జగన్‌ను కలిసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా బోసు హత్య విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. బోసు భార్య శాంతికుమారి ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను కూడా జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని పలు విషయాలను కూడా జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. పార్టీ జీలుగుమిల్లి మండల కన్వీనర్ చందా ప్రసాద్, తగరం రాంబాబు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, ఉప్పల రాంపండు, కుమ్మరి నాగేంద్ర, నెర్సి నాగేంద్ర, గంధం వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నట్టు చెప్పారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


సభల పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చింతలపూడి : ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరెడ్డి రాము డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద గురువారం ఏర్పాటుచేసిన చింతలపూడి ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 5న నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను ఉద్యోగులంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. 11వ పీఎస్‌సీ బకాయిలను చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో చింతలపూడి తాలూకా అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాస్, కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎస్వీ రామకష్టారావు, సంయుక్త కార్యదర్శి జె.గోవిందరావు, ఉపాధ్యక్షుడు నల్లా అప్పారావు, ఏలూరు తాలూకా అధ్యక్షురాలు టి.నీలిమాదేవి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

వేలేరుపాడు: రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించి ఆదుకోవాలని ఆలిండియా ఐక్య రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి సిరికొండ రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని సొంది గొల్లగూడెం గ్రామం రైతు సంఘం గ్రామ జనరల్ బాడీ సమావేశం దుర్గయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ భూములన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇప్పటికే అనేక కుటుంబాలు వ్యవసాయం నుంచి తప్పుకుని కూలీలుగా మారిపోతున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వెబ్ లాండ్ ఓపెన్ చేయించి చనిపోయిన పట్టాదారుల స్థానంలో వారి వారసులకు పట్టాలు ఇచ్చి, సబ్సిడీలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లంకపల్లి శివ, సోంద్ దుర్గయ్య, తెల్ల లక్ష్మయ్య, సొంది చిరంజీవి, ఉషక వెంకటేష్, కుంజా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి


రేషన్ కార్డు దరఖాస్తులను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ద్వారకాతిరుమల: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ద్వారకాతిరుమలలోని సచివాలయం-1ను గురువారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులు, ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈకేవైసీ తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్డుల్లో సభ్యులను చేర్చడం, తొలగించడం వంటి మార్పులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అప్పుడే అర్హులకు సకాలంలో కార్డులు అందుతాయని తెలిపారు. దాదాపు అరగంట పాటు ఆమె సచివాలయంలో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్దే బియ్యం, సరుకులను అందించనున్న నేపథ్యంలో ఆమె జి.కొత్తపల్లిలోని రేషన్ షాపును సందర్శించారు. సులువుగా రేషన్ పంపిణీ చేయడానికి చేపట్టాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఆ తరువాత అదే గ్రామంలో 750 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించి సర్వే నెంబరు 299లోని 15 ఎరాల భూమిని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ జేవీ సుబ్బారావు, దేవకీదేవి తదితరులున్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన


పరిపూడిలో హెచ్ఐవీపై జానపద కళాజాత

కొయ్యలగూడెం: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత జానపద అవగాహన కార్యక్రమం గురువారం పరింపుడి గ్రామంలో నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వేరని వివరించారు. హెచ్ఐవీ సోకిన తర్వాత తీసుకునే రక్షణ జాగ్రత్తల వల్ల 20 ఏళ్లకు పైగా జీవితం గడపవచ్చని అన్నారు. కొయ్యలగూడెం మెయిన్ సెంటర్లో సంత మార్కెట్లో కళాజాత బందాలు అవగాహన కల్పించారు. యాపిల్ సీఎస్సీ, చైల్డ్ ఫర్ ఇండియా, రోటరీ క్లబ్, ఐసీటీసీ, విభాగాల వారు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ జయంతి


బుట్టాయగూడెం : ప్రత్యేక అలంకరణలో స్వామివారు


జంగారెడ్డిగూడెం : దేవులపల్లి పంచముఖి ఆంజనేయస్వామి


కొయ్యలగూడెం : కన్నాపురంలో స్వామివార్ల కళ్యాణోత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయమైన శ్రీ అభయాంజనేయుని ఆలయంలో హనుమద్ జయంతి వేడుకలు గురువారం నేత్రపర్వంగా సాగాయి. ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యహవాచన నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయునికి పంచామృత స్నపన, సహస్ర నామార్చన చేశారు. స్వామివారికి హారతులిచ్చి, నివేదనను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అంజన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బుట్టాయగూడెం అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం ప్రారంభమైన ఏకాహం శుక్రవారం ఉదయం వరకు కొనసాగుతుంది. శనివారం హనుమాన్ చాలీసా, 26న ఊరేగింపు, 29న భారీ అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. రెడ్డిగణపవరంలో విశ్వేశ్వర అన్నపూర్ణ కనకదుర్గమ్మ దేవస్థానంలో అభయాంజనేయ స్వామికి క్షీరాభిషేకం, తమలపాకులతో, గంధ సింధూరంతో అష్టోత్తర పూజలు చేశారు. హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం చేశారు. కేఆర్‌పురం, కొమ్ముగూడెం, గురుగుమిల్లి, తదితర గ్రామాల్లోనూ హనుమద్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

హనుమద్ కల్యాణం

కొయ్యలగూడెం: కన్నాపురంలోని పులిరామన్నగూడెం రోడ్డులో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో సువర్చలా సమేత హనుమద్ స్వామి వార్ల విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించారు. కొయ్యలగూడెంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఆరిపాటి, బయ్యనగూడెం, సరిపల్లి, గ్రామాల్లోనూ హనుమద్ జయంతి వేడుకలు నిర్వహించారు.

హనుమాన్ శోభాయాత్ర

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. గుర్వాయిగూడెం మద్ది క్షేత్రం నుంచి మోటార్ సైకిళ్లతో ప్రారంభమైన శోభాయాత్ర గుర్వాయిగూడెం, జంగారెడ్డిగూడెం కొత్తబస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, హైస్కూల్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, సంతమార్కెట్, పొట్టి శ్రీరాములు విగ్రహం, గంగానమ్మగుడి సెంటర్, కొత్తపేటలోని అభయాంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగింది. శోభాయాత్ర కమిటీ కన్వీనర్ టీవీ రామకృష్ణ యాత్రను ప్రారంభించారు. తొలుత 8 అడుగుల స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. సూరపురాజు కాలనీ హరే శ్రీనివాస భక్త బృందం కోలాటాల భజనతో సహకరించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కమిటీ, శ్రీ వినాయక స్వామి కమిటీ, దండు ధనరాజు ఆధ్వర్యంలో 600 మంది శోభాయాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక మమత ఆసుపత్రి సౌజన్యంతో సుమారు 500 మంది శోభాయాత్రికులకు అన్నప్రసాద వితరణ చేశారు. దేవులపల్లి గ్రామంలో శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్కవరం అభయాంజనేయస్వామి ఆలయంలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. జంగారెడ్డిగూడెం 4వ వార్డు ఇందిరా నగర్ కాలనీలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద వలవల తాతాజీ, మేరీ సుశీల దంపతులు విశేష పూజలు చేశారు.

హనుమద్ జయంతి

పోలవరం రూరల్: పోలవరం, గూటాల, కుంకాల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గూటాల ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

దత్తాత్రేయునికి అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో గురువారం సందర్భంగా ఉపాలయమైన శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ద్వారకాతిరుమల : ఆంజనేయ స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


పోలవరం రూరల్ : గూటాల భక్తాంజనేయస్వామి

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం


పారిజాతగిరిలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం నిత్య ఆరాధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన అనంతరం యాగశాలలో బ్రహ్మోత్సవ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో విశేషంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని అలంకరించి కల్యాణోత్సవాన్ని వైఖానస ఆగమ యుక్తంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలతో మంగళ వాయిద్యములతో ఆలయ కల్యాణ మండపం నిత్య నూతన శోభను సంతరించుకున్నది. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఉభయదారులుగా జంగారెడ్డిగూడెం చెందిన రెడ్డి రంగ ప్రసాద్ కుటుంబ సభ్యులు, రాజమండ్రికి చెందిన తానంకి సత్యనారాయణ జ్ఞానసుధ దంపతులు వ్యవహరించారు. సాయంత్రం శ్రీనివాసునికి చంద్రప్రభ వాహన సేవ చేశారు. అభినయ కూచిపూడి నాట్య అకాడమీ రూపా దేవి శిష్య బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతి రాజు, సభ్యులు రెడ్డి రంగ ప్రసాద్, దండు ధనరాజు, వాసవి సాయి నగేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏర్పాట్లను కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.